# ఇది పూజా - అది ఫలితం

పార్వతమ్మ కాలు మడత పడి, దబ్బున మనిషంత మనిషీ చతికిలబడి పోయింది. కాలువేసిన చోట పాకుడూ లేదు. ఆమె అజాగ్రత్తగా నడిచిన వైనమూ లేదు. కాలు మూడు మెలతలు పడి ప్రాణం విలవిల్లాడి పోతున్న మాట అటుంచితే మనసు ముప్పై మూడు మెలతలుపడి గిజ గిజలాడి పోతోంది.

ఆమెకి నిండా అరవై ఏళ్ళు లేవు. ఏనాడూ మంచమెక్కి ముక్కుతూ, మూలుగుతూ పూటాణ్ణాళ్ళు కూడా పడుకుని ఎరుగదు. అలాంటి దీనాడు యిలా కాలు మెలతపడి కదల్లేకుండా పడుకోవాల్సి వచ్చేసరికి ఎక్కడలేని వుక్రోషంగానూ ఉందామెకి. ఏనాడూ కోడల్ని లెక్కచేసి ఎరుగదు. ఏనాడూ కోడలి చేతివంట తిని ఎరుగదు. ఎప్పుడూ వంటింటి మహారాణిలా రుచి రుచిగా వండి వార్చడమే తెలుసు. అందుకే ఆమె కొడుక్కి ఎవ్వరి వంటా నచ్చదని ఆమె గర్వంగా చెప్పుకుంటుంది.

ఈ రోజు కోడలి దయా ధర్మంమీద ఆధారపడాల్సి వచ్చినందుకు ఎంతో బాధగా వుంది పార్వతమ్మకి.

మంచంమీద పడుకుని ఆలోచిస్తుంటే ఎంత కోపంగా, ఎంత కసిగా ఉందో ! కోపమంతా ఆమెకి ఆ దేవుడి మీదనే. కొంచెం కూడా కనికరం లేని ఆ దేవుణ్ని కనిపిస్తే కడిగి పారెయ్యాలని వుందామెకి.

ఆమె వారానికి ఒక్క తెలుగు సినిమానైనా తప్పకుండా చూస్తుంది. అదేదో సినిమాలో హీరోయిన్ యిలాగే తనకి కష్టాలొచ్చాయని దేవుణ్ని నిలేస్తుంది.

జుట్టు విరబోసుకుని, డాన్సుచేస్తూ ఉద్రేకంగా, పాట పాడుతూ దేవుణ్ని ఎన్నెన్నో ప్రశ్నలు వేస్తూ ఆయన్ని బెదిరించి కళ్ళెర్రచేసి ఝాడించి, తైతక్కలాడి, నువ్విలాంటివాడివి, అలాంటివాడివి అని దూషించి, నిన్నేమైనా యింతవరకు అడిగానా అని నిలేసి అలసిపోయి దేవుడి విగ్రహం ముందు కుప్పకూలిపోతుంది.

పార్వతమ్మ అలా జుట్టు విరబోసుకుని పాటపాడుతూ నాట్యం చెయ్యకపోయినా మనసు మాత్రం అదే స్థితిలో వుంది. అలాగే రగిలిపోతోంది.

"అవును మరి నేను ఎంతెంతమంది దేవుళ్ళకి ఎన్నెన్ని పూజలు చేశాననీ ఎన్ని నోములు నోచాననీ, ఎన్ని వ్రతాలు చేశాననీ, అవన్నీ వృధా అయినట్టేగా ఈ రోజిలా కాలు మడతపడి మంచాన పడ్డానంటే—"

"అసలు నేను పూజ చేయడమంటేనే ఓ ప్రత్యేకత వుంటుంది. పూలు కోయడం దగ్గరినుంచి నా పద్ధతే వేరు. పూజకి పూలు కావాలంటే తెల్లారగట్ట లేచి మా యింట్లో చెట్లకున్న పూలతోబాటు పక్కవాళ్ల యిళ్లల్లో పూసిన పూలు కూడా కోసేసు కొచ్చేసేదాన్ని. వాళ్ళు లేవకముందే పసిరిక మొగ్గలతో సహితం తెచ్చేస్తే గానీ నాకు తోచేదికాదు. అంత కష్టమూ ఎందుకు? దేవుడికి పూజలు చేయడానికి-పుణ్యం సంపాదించడానికే కదా" — పార్వతమ్మ ఆలోచనలు సాగిపోతూనే వున్నాయి.

"ఏమో, నాకు మాత్రం చిన్నప్పట్నించి దేవుణ్ని పూజించటంలో పక్కవాళ్ళతో మహాపోటీగా ఉండేది. చిట్టిబొట్టినోము, పండు తాంబూలం దగ్గరనుండి మొదలుపెట్టి శ్రావణమాసం నోములు, అట్లతద్దినోములు, సావిత్రి గౌరిదేవి, పదహారపళ్ళ నందికేశుడు, రుషి పంచమి ఇలా ఒకటేమిటి? అసలు నేను చెయ్యని నోమంటూ, వ్రతమంటూ వుందా? లేదు.

ఒక్కొక్క పుణ్యకార్యానికి ఎంత కష్టపడ్డాను ! అందరితో ఎంతో పోట్లా

డానో ఆ దేవుళ్ళకే తెలియాలి. వాళ్ళే అది అర్థం చేసుకుంటే ఈనాడు నాకీ కష్టం వచ్చేది కాదు."

కొన్ని గుర్తుకొస్తుంటే పార్వతమ్మ బాధ మరీ ఎక్కువై పోతోంది.

పదహారు పళ్ళనోము చెయ్యాలనుకున్నప్పుడు యింట్లో కోడలు లక్ష్మి ఎంత రాద్ధాంతం చేసిందనీ, డబ్బులేదనీ, పిల్లల చదువులకీ, ఫీజులకీ, బట్టలకే చాలక చస్తుంటే ఈ నోములు, వ్రతాలూ ఏమిటి అంటూ కొడుకుతో తగవు పెట్టుకుంది. కాని ఆమె తెలివైందనుకుందేమో అత్తగారు అంతకంతకూ పోట్లాడి యిద్దరి నోళ్ళు మూయించింది.

"ఏదో ఈ జన్మలో యింత పుణ్యం చేసుకుందామని అనుకుంటే దాని సొమ్మేం పోయిందట" అని కసురుకుంది. నందికేశుడి నోముకి పుట్టింటికి పోతానని బెదిరించింది కోడలు. పోతే పొమ్మంది గానీ ఆమె లొంగలేదు.

"నీ ఖర్చులకే పదివేల అప్పు మిగిలింది" అన్నాడు ఒకనాడు కొడుకు. ఆ మాట భరించలేక నాలుగూ దులిపింది.

"కన్నతల్లి రుణమెలా తీర్చుకుంటావురా" అనేసరికి తెల్లముఖం వేశాడా వెర్రి నాగన్న.

"ఏ పూజ చేసినా, ఏ నోము నోచినా నాదే పై చెయ్యిగా వుండాలి. దేవుడు నా భక్తికి మెచ్చి, నా కష్టాలు గట్టెక్కించి నన్ను కాపాడాలి" ఇదీ పార్వతమ్మ పద్ధతి.

"మా వియ్యపురాలు వచ్చినప్పుడు ఆమెగారు తెల్లారి లేస్తూనే పూజా మందిరంలో పూజ చేసేస్తుంది. నేనేం చేస్తాను? అవన్నీ క్షణంలో తీసిపారేసి, దులిపేసి మళ్ళీ నేను నా పూలతో పూజ చేస్తాను. ఆమెగారు సణుక్కుంటుంది. అయినా నాకేమిటి? నేను మాత్రం పక్క మనిషిని అస్సలు ఓర్చుకోలేను. నాకంటే ఎవరు ముందున్నా సహించలేను. నా పనికి ఎవరడ్డు వచ్చినా ఊరుకోను" -

ఆ మధ్య నాగులచవితినాడు తెల్లారిలేస్తూనే నాకోడలికి కడుపులో నొప్పొచ్చి, వున్నపళంగా హాస్పత్రిలో చేర్చాల్సివచ్చింది. పదేళ్ళ మనవరాల్నిచ్చి పంపానే గానీ, నా పుట్టలో పాలుపోయడం మానుకోలేదు. అవును మరి. మడి కట్టుకుని, చలిమిడి, చిమ్మిలి అన్నీ చేసి, రెండు మైళ్ళ దూరం నడిచి వెళ్ళి పుట్టలో పాలుపోసి మరీ వచ్చాను. నా కొడుకు ఎంత రాద్ధాంతం చేశాడో - మరీ.... సంసారమన్నాక

కడుపులో నొప్పులూ, కాళ్ళ నొప్పులు వస్తూనే వుంటాయి. అంతమాత్రాన దేవుడికి అన్యాయం చేస్తామా" -

"ముక్కోటి దేవతలకి ఎన్నో పూజలు చేశాను. అయినా నా కెందుకిలా కాలికి దెబ్బ తగిలిందో అర్థం కావడంలేదు." పార్వతమ్మ తలుచుకునీ తలుచుకునీ మరీ మధన పడసాగింది.

"ఒరేయ్ అబ్బాయి చిత్రగుప్తుడి వ్రతం సామాన్యం కాదురా, అన్ని దానాలూ చెయ్యాలి. ఓ కాసు బంగారం కొనియ్యరా - సువర్ణదానం ముఖ్యం" అంది.

"అదేమిటమ్మా భూదానం, గోదానం - అన్నీ చెయ్యాలి. అన్ని ముఖ్యమే" అన్న కొడుకు మాటల్లో వున్న వ్యంగ్యం విని ఒళ్ళు మండిపోయింది పార్వతమ్మకి.

"ఏం నాయనా! ఆ మాత్రం కన్నతల్లి కోసం చెయ్యలేవా! ఆ సువర్ణదానం ఎవరికిస్తాను, నా కూతురు, నీ చెల్లెలూ విజయకేగా" అంది

అంతలో కోడలు అందుకుంది.

"పెళ్ళయి పన్నెండేళ్ళయింది. ఒక్క కాసు బంగారం పెట్టి సన్నగా నల్లపూసలు చేయించుకుందామంటే దిక్కులేదుగానీ దానం చెయ్యడానికి కాసు కావాల్ట" అంటూ విసుర్లు మొదలుపెట్టింది.

చూడండి ఎంత అన్యాయమో! మా యిద్దరి మధ్యా మాటామాటా పెరుగుతుందని మా వెర్రి నాగన్న భయం.

"అమ్మా నీ వంటిమీదున్న పది కాసుల్లో ఒక కాసు విజయకిచ్చేయి" అని చచ్చు సలహా యిచ్చాడు.

ఆమేం వూరుకోలేదు. ఏం నాయనా! ఈ తెలివి నీదేనా లేక అరువు తెచ్చుకున్నావా - అయితే విను. ప్రపంచంలో న్యాయం అంటూ వుండాలి. నా వంటిమీద బంగారమంతా విజయదని ఎప్పుడో నిర్ణయించేశాను. అందులో మళ్ళీ దానమేమిటి ?

"ఇదిగో ఇప్పుడే చెప్తున్నా ఇల్లు గుల్లచేస్తూ ఈ బంగారాలు, గింగారాలు కొంటూ కూర్చుంటే నేను ఉరిపోసుకు చస్తా. ఎంత అన్యాయం? ఈమెగారి వంటిమీద బంగారమంతా కూతురికేనట మరి. ఈమెగారి ఖర్చులన్నీ కొడుక్కి, కోడలికి మెడలో హారాలట" అంటూ అరిచింది.

"నా వంటిమీద బంగారం నా ఆడపిల్లకే యిస్తాను అది ధర్మం. నాకన్నీ చేసి నన్ను చూడాల్సిన బాధ్యత కొడుకుదీ, కోడలిదీనూ...."

"ఆయన మెత్తని మనిషి కనుక మీ అన్యాయం సాగుతోంది"అని ఎదురు.

ఎలాగైతేనే ఏడువేల ఖర్చుతో, చిత్రగుప్తుడి వ్రతం, లక్షవత్తుల నోమూ పూర్తి చేశాను.

పాపాల చిట్టాలోంచి పాపాలు కొట్టేయడానికి చిత్రగుప్తుడికి లంచం ముట్టిందనీ కోడలు హేళన చేసింది.

ఓ దేవుల్లారా ! మీరింతమంది వున్నారు. మీ అందర్నీ అష్టకష్టాలుపడి పూజించాను. మరి నాకెందుకీ కాలు మడతపడి ఈ బాధ ?

పార్వతమ్మ ఆలోచిస్తూ, బాధపడుతూ, అలసిపోయి నిద్రలోకి జారుకుంది.

ఎవరో తట్టి లేపుతుంటే కళ్ళు తెరిచిన పార్వతమ్మకి ఎదురుగా కోడలు కనిపించింది.

"లేవండత్తయ్యా ముఖం కడుక్కోండి. కాఫీ తాగి స్నానం చేద్దురు" లక్ష్మి గొంతులో ఎంతో సౌమ్యత.

"వేణ్ణీళ్ళు బాత్‌రూంలో పెట్టాను."

"పూలు కోసి దేవుడి దగ్గర పెట్టాను."

"పాపం మూడు నాళ్ళుగా పూజకూడా చేసుకోలేదు." ఆమె గొంతులో సానుభూతికి పార్వతమ్మకి వూరట కలిగింది.

"లేవండత్తయ్య మీకసలే పట్టింపు. ఒక్కపూటకూడా దేవుడి దగ్గర దీపం పెట్టకపోతే వుండలేరు. పార్వతమ్మ గుండె గుబగుబలాడినట్లయింది. ఏడుపొచ్చినట్లయింది.

"ఏమోనమ్మా ! ఆ దేవుళ్ళకి నామీద దయలేదు. నా పూజలన్నీ వ్యర్థమే. నే నింకేమీ పూజలు చెయ్యను. పూజలూ వద్దు పుణ్యాలూ వద్దు."

"తప్పండీ అత్తయ్యా ! ఆ దేవుడి దయవల్లే చిన్న దెబ్బ తగిలింది. అదే ఎముక విరిగితే ఎంత అవస్థ పడేవాళ్ళం. అదే దేవుడి దయ. లేవండి. పూజ కూడా చేసుకోండి"-

లక్ష్మి గొంతులోంచి ఏదో అమృతం జాలువారుతున్నట్లనిపించింది. గుండె లోపలి ఎక్కడో చిన్న దీపం వెలిగినట్లనిపించింది పార్వతమ్మకి.

కోడలు లక్ష్మి దేవుడి దయగా నిద్రలోంచి మేల్కొలుపుతున్నట్లనిపించిందామెకి.